క్లుప్తంగా

ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే వైవీఆర్‌కు ప్రసాదం అందజేస్తున్న పాలకమండలి సభ్యులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని పాలకమండలి సభ్యులు సోమవారం కోరారు. ఈ మేరకు ఆహ్వానపత్రిక అందజేశారు. అదేవిధంగా నెట్టికంటి ఆంజనేయస్వామి తీర్థప్రసాదాలు, పట్టు వస్త్రాలను కూడా ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో లోక్‌నాథ్‌శర్మ, త్యాగరాజు, జగదీష్ సేట్, మల్లికార్జున రెడ్డి, గంతుల రామాంజనేయులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రిచ్ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన నల్ల నరసింహారెడ్డి సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ వారు ఇటీవల నిర్వహించిన రిచ్ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ జాతీయస్థాయి హ్యాకథాన్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ డేటా సైన్స్ విద్యార్థులు గ్రీష్మ, చిన్మయి, గౌస్‌పీర్, లోక్‌సాయి, లాస్య, మజూర్ జాతీయ స్థాయిలో 3వ బహుమతి సాధించారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, హెచ్‌ఓడీ డాక్టర్ చిత్రలింగప్ప అభినందించారు.

టీడీపీ నాయకుల అత్యుత్సాహం

- జగనన్న స్టిక్కర్లపై టీడీపీ స్టిక్కర్లు అతికించిన నాయకులు



స్టిక్కర్ అతికించిన వారిపై మండిపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి

యాడికి: టీడీపీ నాయకులు బరి తెగించారు. మండలంలోని పెద్దపేట గ్రామంలో సోమవారం అత్యుత్సాహంతో గోడలపై ఉన్న జగనన్న స్టిక్కర్లపై తమ నాయకుడు జేసీ అస్మిత్ రెడ్డి సమక్షంలో టీడీపీ స్టిక్కర్లు అతికించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వివరాలు.. తాడిపత్రి టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అస్మిత్‌రెడ్డి, యాడికి టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ రంగయ్య ఆధ్వర్యంలో పెద్దపేట గ్రామంలో ఇంటింటికీ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఇళ్ల వద్దకు వెళ్లిన తెలుగు తమ్ముళ్లు గోడలపై ఉన్న జగనన్న స్టిక్కర్లపై టీడీపీ స్టిక్కర్లు అతికించారు. యాడికి 18వ వార్డు వైఎస్సార్‌సీపీ సభ్యురాలు లక్ష్మీదేవికి చెందిన ఇంటి గోడపై ఉన్న జగనన్న స్టిక్కర్‌పై టీడీపీ స్టిక్కర్ అతికిస్తుండటంతో భర్త రామకృష్ణారెడ్డితో కలిసి అడ్డుకుంది. టీడీపీ స్టిక్కర్ అతికిస్తున్న వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఉద్దేశ పూర్వకంగా ముఖ్యమంత్రి జగనన్న స్టిక్కర్‌పై టీడీపీ స్టిక్కర్ అతికించడం బాగా లేదని జేసీ అస్మిత్‌రెడ్డితో వాదనకు దిగారు. దీన్ని చూసిన తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంఘటన స్థలానికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెదర గొట్టి, టీడీపీ స్టిక్కర్లను తొలగించడంతో గొడవ సర్దుమణిగింది.

8,705 మందికి పింఛన్ కానుక



బంకమడి వీధిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

తాడిపత్రి టౌన్: మే నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ సోమవారం ప్రారంభమైంది. మున్సిపాలిటీ పరిధిలో 9,687 మంది పింఛన్‌దారులు ఉండగా.. సాయంత్రం 5 గంటల వరకూ 8,705 మందికి పింఛన్ సొమ్ము అందజేసినట్లు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. పింఛన్ల పంపిణీకి సహకరించిన వలంటీర్లు, అధికారులను కమిషనర్ అభినందించారు.

సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు

- 'జగనన్నే మా భవిష్యత్‌'కు విశేష ఆదరణ
- ఎమ్మెల్యే వైవీఆర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న సంక్షేమ పాలనకే ప్రజలు మద్దతు ఇస్తున్నట్లు పీపుల్స్ సర్వేలో స్పష్టమైందని ఎమ్మెల్యే వై.వెకంటరామిరెడ్డి (వైవీఆర్) పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సందర్భన పూర్తియిన సందర్భంగా సోమవారం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారదర్శకంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరికీ వివరించే లక్ష్యంతో ఏప్రిల్ 7 నుంచి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో దాదపు 86.3 శాతం గృహాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సందర్శించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారన్నారు. అంతేకాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలియచేస్తూ స్వచ్ఛందంగా 8296082960 నంబర్‌కు 65 శాతం మందికిపైగా మిస్డ్ కాల్ ఇచ్చారని తెలిపారు. ఈ పీపుల్స్ సర్వేకు ప్రజల నుంచి అనుహ్య మద్దతు లభించిందని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల సొమ్మును ప్రజల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గుర్తు చేశారు. కాబట్టి ఏ ఇంటి వెళ్లినా స్వచ్ఛందంగా స్టిక్కర్లు అతికించుకునేందుకు ప్రజలు ముందుకు వచ్చారన్నారు. దీన్ని బట్టి చూస్తే రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ కై వసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా చేసుకుంటారని తెలిపారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

నియోజకవర్గంలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు

నియోజకవర్గంలో ఎన్నాడు లేని అభివృద్ధి తమ ప్రభుత్వంలో సాధించినట్లు వైవీఆర్ తెలిపారు. గుంతకల్లు ప్రభుత్వ అస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడంతో పాటు రూ.13 కోట్లతో మరో భవనం ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. ఆర్‌డీఓ కార్యాలయం ఏర్పాటు చేయడంతో రెవెన్యూ పరమైన సమస్యలను ఇక్కడే పరిష్కరించుకునేందుకు అవకాశం కలిగిందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలను ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా పట్టణంలో దాదాపు 80 శాతంపైగా తాగునీటి సమస్యను పరిష్కారించామని వెల్లడించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు పెద్ద ఎత్తున నిర్మిస్తున్నట్లు తెలిపారు. గుత్తి, పామిడి పట్టణాల్లో శాశ్వతగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.170 కోట్లతో చేపట్టిన పనులు యుద్ధప్రాతిపదకన జరుగుతున్నట్లు తెలియజేశారు. హంద్రీ–నీవా ద్వారా సాగునీటిని ఇచ్చేందుకు రైతులు సహకరించడం లేదన్నారు. ఈ సమస్యపై రైతాంగంతో చర్చించి, అన్ని చెరువులకు సాగునీటిని అందిస్తామని భరోసా ఇచ్చారు. గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా కోటకు రోప్‌వే పనుల ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అంతేకాకుండా జగనన్న హౌసింగ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.రామలింగప్ప, ఎస్సీ సెల్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్ మోహన్, జెడ్పీటీసీ కదిరప్ప, వీరశైవ లింగాయత్ రాష్ట్ర డైరెక్టర్ పాటిల్ యుగంధర్‌రెడ్డి, మండల కన్వీనర్ బి.మోహన్, గృహసారథుల మండల కన్వీనర్ ఎన్.గోవిందునాయక్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్.భీమలింగప్ప, మాజీ పట్టణ కన్వీనర్ ఎద్దుల శంకర్, కౌన్సిలర్లు వై.సుధాకర్, సమోబాషా, కో–ఆప్షన్ సభ్యుడు మాబు, నాయకులు నూర్‌నిజామి, వినోద్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



మాణిక్య రంగనాథ స్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో మాణిక్య రంగనాథ స్వామి కల్యాణం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైశాఖ మాసం ఏకాదశిని పురస్కరించుకొని స్వామికి వేకువజాము నుంచి అర్చకులు ప్రాతకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను రంగు రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత మాణిక్య రంగనాథుడి కల్యాణం వేద మంత్రాల నడుమ ఘనంగా జరిపించారు. స్వామికి ప్రాకారోత్సవం నిర్వహించి పల్లకీ సేవ చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గుత్తి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, రాచమడుగు చంద్రశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ లబ్ధి



గార్లదిన్నెలో ఓ వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ అన్ని వర్గాల వారికి పారదర్శకంగా పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అధికారులతో కలసి ఇంటింటికి వెళ్లి, వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ ఆయా కుటుంబాలకు కరపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలు అందించారన్నారు. అభివృద్ధి చూసి ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. అలాగే కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అదే విధంగా దేశంలో ఎక్కడా లేని విధంగా 3,500 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో స్వర్ణ యుగం తలపించేలా సంక్షేమ పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? వలంటీర్లు పింఛన్ సకాలంలో అందిస్తున్నారా అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బమ్మ, మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, అనంతపురము మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, పాలఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, ఎంపీడీఓ విజయభాస్కర్, హౌసింగ్ ఏఈ విజయ భాస్కర్ రావు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిర్మాణాత్మక పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కోరిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సన్మానించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు

తాడిపత్రి: వైఎస్సార్‌సీపీని మరింత బలపరిచేందుకు అవసరమైన నిర్మాణాత్మక పనులను త్వరితగతిన చేపట్టేలా చూడాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య కోరారు. సోమవారం ఆయన జిల్లా వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులతో కలసి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలో మర్యాదపూర్వకంగా కలిశారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతం కావడం, ఇటు వైఎస్సార్‌సీపీకి ప్రజలతో పాటు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై నమ్మకం పెరిగడంతో జిల్లాలోని ఎమ్మెల్యేలను కలిసి ధన్యవాదాలు తెలుపుతున్నామని పైలా నరసింహయ్య తెలిపారు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీని అన్ని రకాలుగా బలోపేతం చేసి, జిల్లాలో వందకు వంద శాతం సీట్లను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు సంబంధించి ఈనెల 5వ తేదీలోపు అనుబంధ విభాగాలకు సంబంధించి, మండల, పట్టణ విభాగాల కమిటీలను ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు.

మా భవిష్యత్తుకు జగన్‌తోనే భరోసా..

రాష్ట్ర వ్యాప్తంగా గృహసారథులు, మండల కన్వీనర్లు చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు, జగనన్నే మా నమ్మకం కార్యక్రమాలు విజయవంతం అయ్యాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు మా భవిష్యత్తుకు భరోసా జగన్‌తోనే సాధ్యమని సంతోషంగా చెబుతున్నారని పేర్కొన్నారు. 1.16 కోట్ల మంది నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి వారికి వైఎస్సార్‌సీపీ, ముఖ్యమంత్రిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నామరూపాలు లేకుండా పోతుందని జోస్యం చెప్పారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ఫ్యాన్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా నాయకులు బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి రమేష్‌గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, ట్రేడ్ యూనియన్ కొర్రపాడు హుసేన్‌పీరా, మైనార్టీ విభాగం సైపుల్లాబేగ్, రైతు విభాగం ఎస్వీ నారాయణ, వికలాంగుల విభాగం రంగనాథరెడ్డి, బీసీ సెల్ వీరన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా యువత అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



మగ్గం పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ, జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 73 మంది ఎస్సీ చేనేత కార్మికులకు మంజూరైన మగ్గం పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్.ఎస్ ద్వారా క్లస్టర్ డెవలప్‌మెంట్ సభ్యులతో పాటు క్లస్టర్ పరిధి వెలుపల ఉన్న చేనేత కార్మికులు కూడా తమ పనులను ఉన్నతీకరణ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 90 శాతం వాటా సబ్సిడీతో మగ్గం పరికరాలు అందిస్తోందన్నారు. జిల్లాలో 122 మంది ఎస్సీ చేనేత కార్మికులు ఉండగా తాడిపత్రి నియోజక వర్గంలో 73 మందికి పరికరాలు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఐదుగురు లబ్దిదారులకు 90 శాతం సబ్సిడీతో రూ.95,350 విలువ చేసే మోటరైజ్‌డ్ లిఫ్టింగ్ డివైజ్ ఫర్ డ్యూకార్డ్, 68 మంది రూ.13,92300 విలువైన మోటరైజ్‌డ్ లిఫ్టింగ్ డివైజ్ ఫర్ డ్యూకార్డ్ అందజేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే చేనేత మగ్గం కలిగిన వ్యక్తికి మగ్గం ఆధునీకీకరణ కోసం ఏడాదికి రూ. 24 వేల చొప్పున అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామ్మూర్తి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, జిల్లా పార్లమెంట్ జగనరల్ సెక్రెటరీ రవి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సరోజ, సర్పంచ్ ఓబుళమ్మ, కో ఆప్షన్ సభ్యుడు హాజీవలి పాల్గొన్నారు.

అమరుల త్యాగఫలమే కార్మికుల దినోత్సవం



గుంతకల్లు: హమాలీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ



శింగనమల: సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు/తాడిపత్రి టౌన్/శింగనమల/గుత్తి/యల్లనూరు/పెద్దవడుగూరు/బుక్కరాయసముద్రం/గార్లదిన్నె/పామిడి/యాడికి: గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్మికుల హక్కులను రక్షించే క్రమంలో అశువులు బాసిన వేలాది మంది కార్మికుల త్యాగఫలమే కార్మికుల దినోత్సవమని వక్తలు పేర్కొన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో మే డేను ఘనంగా జరుపుకున్నారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్, రైల్వే క్రీడా మైదానం వద్ద యూనియన్ కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. అదేవిధంగా రైల్వే ఆస్పత్రి సమీపంలోని ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ జెండా ఆవిష్కరించి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. సీపీఐ అనుబంధ సంస్థ హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకలకు ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ హాజర్యయారు. తాడిపత్రిలోని రంగప్ప కాలనీలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. శింగనమలలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు, సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, సుంకన్న, వెంకటస్వామి తదితరులు జెండాను ఆవిష్కరించారు. గుత్తి ఆర్‌ఎస్ నుంచి గుత్తిలోని రాయల్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ హుస్సేన్ పీరా, భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చంద్ర, కృష్ణమూర్తి, అబ్దుల్ కరీం, అధ్యక్షులు వెంకట రమణ, ఉపాధ్యక్షులు వెంకటరాముడు, సెక్రెటరీ మహ్మద్ రఫీ, కోశాధికారి దేవరాజ్ పాల్గొన్నారు. యల్లనూరులో నిర్వహించిన వేడుకల్లో కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు రాజారామిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బులేసు, రమేష్, డేనియల్, అంగన్వాడీ వర్కర్స్ సెల్ పర్సన్ యూనియన్ నాయకులు నాగేశ్వరమ్మ, హేమావతి, జయలలిత పాల్గొన్నారు. పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు, పెద్దవడుగూరు గ్రామాల్లో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల కార్యకర్తలు నారాయణస్వామి, అల్లాబకాష్, పోలా రంగస్వామి, మల్లికార్జున గౌడ్, శేషుగోపాల్, రామాంజినేయులు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. బుక్కరాయసముద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులు జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, శ్రీనివాసులు, సీపీఐ నియోజక వర్గం కార్యదర్శి నారాయణస్వామి, మండల కార్యదర్శి మద్రిస్వామి, రామక్రిష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. గార్లదిన్నెలో జరిగిన మే డే వేడుకల్లో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి అక్బర్ వన్నూర్ప, సుబ్బన్న, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. పామిడిలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా మే డే కార్యక్రమాలు నిర్వహించారు. యాడికి మండలం చందన గ్రామంలో జరిగిన మే డే వేడుకల్లో పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆది నారాయణ, సుబ్బయ్య, బీసీ రామప్ప పాల్గొన్నారు.



తాడిపత్రి టౌన్: జెండా ఆవిష్కరించి, నినాదాలు చేస్తున్న నాయికులు



గుత్తి: భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

రేపు భూముల వేలం

తాడిపత్రి: చిన్నపొడమల గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి దేవస్థానాలకు చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 3న మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. గ్రామంలోని దేవస్థానం వద్ద దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.1,000 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

6న మోడల్ ఎంసెట్

గుంతకల్లు: పట్టణంలోని శస్త్ర కళాశాలలో ఈనెల 6వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఎంసెట్ (ఆన్‌లైన్) పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వాణి కోరారు. సోమవారం కళాశాలలో మోడల్ ఎంసెట్‌కు సంబంధించిన కరప్రతాలను విడుదల చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 846608847, 6281963077 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీ.రమేష్, కళాశాల కరస్పాండెంట్లు చంద్రశేఖర్, రమణ పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

తాడిపత్రి టౌన్: మండలంలోని ఆవుల తిప్పాయిపల్లి గ్రామంలో ఓబులేసు కోన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి శుక్రవారం వరకూ నాలుగు రోజుల పాటు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం వాసుదేవ పుణ్యాహవచనం, క్షీరాభిషేకం, దీక్షాహోమం, ధ్వజారోహణం, బుధవారం శేష వాహనంపై స్వామి ఊరేగింపు, గురువారం గరుడ వాహనంపై స్వామి ఊరేగింపు, శుక్రవారం లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

4న గొల్లకొండ వెంకటరమణ స్వామి కల్యాణం

శింగనమల: మండల కేంద్రంలో ఈనెల 4వ తేదీన గొల్లకొండ వెంకటరమణ స్వామి కల్యాణం జరగనుంది. ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామిని పల్లకీలో ఊరేగించారు. 2వ తేదీ రాత్రి స్వామిని హనుమద్ వాహనంపై ఊరేగించనున్నారు. 3వ తేదీ రాత్రి గరుడసేవ, 4వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకూ రామాలయంలోని తలంబ్రాల మండపంలో వెంకటరమణ స్వామి, కల్యాణం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి హాజరుకానున్నారు. 5వ తేదీన రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాషువా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే కార్యక్రమానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని సూచించారు.